క్లుప్తంగా

యోగాతో శారీరక, మానసిక దృఢత్వం



ద్వారకాతిరుమల అంగన్‌వాడీ కేంద్రంలో యోగాసనాలు వేస్తున్న మహిళలు

ద్వారకాతిరుమల: ప్రతిరోజూ యోగా చేయడం వల్ల శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మేరీ అన్నారు. ద్వారకాతిరుమలలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. అందులో గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.అనంతరం జీఎంఎస్‌కే లక్ష్మీ సుజనా మాట్లాడుతూ క్రమం తప్పకుండా చేసే వ్యాయామం వల్ల సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చన్నారు.ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

సబ్ జైల్ తనిఖీ



చింతలపూడి సబ్ జైల్‌ను తనిఖీ చేస్తున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి

చింతలపూడి: ఉమ్మడి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె రత్న ప్రసాద్ శుక్రవారం మండలంలో పర్యటించారు. పట్టణంలోని సబ్ జైల్, ఇంటిగ్రేటెడ్ గరల్స్ హాస్టల్‌లను తనిఖీ చేశారు. సబ్‌జైల్‌లో నిందితుల కేసు వివరాలు అడిగి తెలుసుకున్నారు. రిమాండ్ ఖైదీల ఆరోగ్యం, వారికి అందజేస్తున్న ఆహారం, తాగునీరు తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఖైదీలకు అందిస్తున్న వైద్య సదుపాయాలు, ఉచిత న్యాయ సలహాలపై ఖైదీలను ఆరా తీశారు. వంట శాలను, స్టోర్ రూమ్‌లను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో సబ్ జైల్ పర్యవేక్షణాధికారి కృపానందం, న్యాయవాది ఏసుపాదం, సోషల్ వర్కర్ ఎండీ అక్బర్ ఆలీ, ప్యానల్ అడ్వకేట్ పి డేవిడ్ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

పిడుగు పడి గేదెలు మృతి



ఘటనా స్థలంలో మృతి చెందిన గేదెలు

కామవరపుకోట: పిడుగు పడి రెండు గేదెలు మృతి చెందిన ఘటన మండలంలో సాగిపాడు శివారు వీరంపాలెంలో శుక్రవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం వీరంపాలెం గ్రామానికి చెందిన లాగు నాగరాజుకు చెందిన రెండు గేదెలు గ్రామ సమీపంలో తోటలోకి మేతకు వెళ్లగా మధ్యాహ్నం వర్షం కురిసే సమయంలో అకస్మాత్తుగా పిడుగు పడటంతో రెండు గేదులు అక్కడక్కడే మృతి చెందినట్లు తెలిపారు. రెవెన్యూ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



ధర్మాజీగూడెంలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నేతలు

లింగపాలెం: ధర్మాజీగూడెంలో బీసీ ఏరియాలో సీసీ రోడ్ల నిర్మాణానికి సర్పంచ్ కొత్తూరు మౌనిక శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ మేరకు సర్పంచ్ మౌనిక మాట్లాడుతూ గ్రామ పంచాయతీ 15 ఫైనాన్స్ నిధుల నుంచి రూ.4.50 లక్షలతో బీసీ ఏరియాలో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్టు తెలిపారు. పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు మాజీ సొసైటీ చైర్మన్ ఉప్పలపాటి వరప్రసాద్, మోరంపూడి జగన్, నేతలు నూతలపాటి శ్రీను, కె రమేష్, పంచాయతీ వార్డు మెంబర్లు నాగబాబు, మురళి పాల్గొన్నారు.

ఆక్వా సాగు పరిశీలన

గణపవరం: ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యంగా గోదావరి జిల్లాల్లో విస్తారంగా ఉన్న ఆక్వా సాగు, పాటించాల్సిన మెలుకువలను తెలుసుకోవడానికి ఒడిస్సాకు చెందిన మత్స్యశాఖ విద్యార్థులు గణపవరం మండలంలో పర్యటించారు. మండలంలోని కేశవరం, అర్ధవరం జిల్లాల్లో సుమారు 22 మంది విద్యార్థులు పర్యటించారు. రైతుల నుంచి సాగు పద్ధతులు, మేతల వినియోగం, చెరువుల నిర్వహణ తదితర అంశాలపై వారు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇటీవల ఒరిస్సా ప్రభుత్వం నూతన సాంకేతిక సిబ్బందిని మత్స్యశాఖలో నియమించింది. వీరంతా ఆంధ్రప్రదేశ్‌లో చేస్తున్న ఆక్వా సాగుపై అవగాహన పొందడానికి వచ్చినట్లు టీం కోఆర్డినేటర్ మనోరంజన్ మహాపాత్ర తెలిపారు. గణపవరం మత్స్యశాఖ అధికారి శివరామకృష్ణ, మత్స్యశాఖ అసిస్టెంట్ షర్మిల, ఆక్వా రైతులు సీతారామరాజు పాల్గొన్నారు.

ఎన్నికల హామీల అమలులో నిర్లక్ష్యం

- చంద్రబాబు 100 రోజుల పాలనపై ప్రజల పెదవి విరుపు
- సూపర్ సిక్స్ హామీలను విస్మరించడంపై ఆగ్రహం



అభివృద్ధికి దూరంగా నియోజకవర్గ కేంద్రం చింతలపూడి



అభివృద్ధికి నోచుకోని చింతలపూడి ఎత్తిపోతల పథకం కాలువ



పట్టిన్నపాలెంలో జల్లేరు వాగుపై అసంపూర్తిగా వంతెన నిర్మాణం



కామవరపుకోట, లింగపాలెం మండలాల మధ్య గుండేరు వాగుపై కూలి పోయిన వంతెన



లింగపాలెం మండలంలో ధ్వంసమైన ప్రధాన రహదారి

చింతలపూడి: సూపర్ సిక్స్ హామీతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం గద్దెనెక్కి 100 రోజుల పాలనలో చేసింది ఏమీ లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. అధినేతే అనుకుంటే కూటమి తరుపున పోటీ చేసిన ఎమ్మెల్యేలు సైతం ఎన్నికల్లో అలవికాని వాగ్దానాలను ప్రజలకు ఇచ్చారు. తీరా అధికారంలోకి వచ్చాక నిధుల లేమి సాకుతో వాటిని నెరవేర్చే విషయం పట్టించుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే చింతలపూడి పట్టణాన్ని సెంటర్ లైటింగ్‌తో సర్వాంగ సుందరంగా అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ పట్టణ ప్రజలకు హామీ ఇచ్చారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం పనులు ప్రారంభించి రైతులకు సాగునీరు అందించడానికి కృషి చేస్తానని రైతులకు హామీ ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 80 శాతం పూర్తయిన 100 పడకల ఆసుపత్రిని పూర్తి చేయిస్తానని, రహదారులను అభివృద్ధి చేస్తానని తెలిపారు. అధికారంలోకి వచ్చి నూరు రోజులు పూర్తి కావస్తున్నా ఇచ్చిన హామీలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయని ప్రజలు విమర్శిస్తున్నారు.

కామవరపుకోట: ఎమ్మెల్యే రోషన్ కుమార్ సూపర్ సిక్స్‌తో పాటు లింగపలెం, కామవరపుకోట మండలాలను కలుపుతూ గుండేరు వాగుపై వంతెన నిర్మిస్తానని, మండలంలోని ఆర్‌అండ్‌బీ, పంచాయతీ రాజ్ రహదారులు, సీసీ రోడ్ల నిర్మాణం చేపడతానని హామీ ఇచ్చారు. ఇప్పటి వరకు వాటి నిర్మాణాలు చేపట్టకపోవడంతో ప్రజల్లో వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

జంగారెడ్డిగూడెం రూరల్: ప్రస్తుత ప్రభుత్వంలో ఎక్కడా అభివద్ధి పనులు జరుగుతున్న దాఖలాలు లేదు. గ్రామాల్లో రహదారులు, వాగులపై వంతెన నిర్మాణాలు, ఎర్రకాలువ గట్టు కోతకు గురవడంతో పంట పొలాలు ముంపు వంటి సమస్యలు తిష్టవేశాయి. ఈ ప్రభుత్వంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్‌లో రహదారుల నిర్మాణానికి రూ:5 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులకు సంబంధించి టెక్నికల్ అనుమతులు రావాల్సి ఉంది. జంగారెడ్డిగూడెం మండలంలోని పట్టిన్నపాలెంలో జల్లేరు వాగుపై నిలిచిపోయిన వంతెన నిర్మాణాలు పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు. వంతెన నిర్మాణంలో భాగంగా తాత్కాలికంగా రాకపోకలు సాగించేందుకు డైవర్షన్ రహదారి నిర్మించారు. వర్షాలకు వాగు ఉదతిగా వస్తున్న సమయంలో డైవర్షన్ రహదారి మీదుగా వరద ప్రవహించడంతో ఏజెన్సీ, మెట్ట ప్రాంతాల ప్రజల రాకపోకలు నిలిచిపోతున్నాయి.

లింగపాలెం: రహదారులు ధ్వంసమై ప్రయాణికుల పాలిట శాపంగా మారాయి. ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ దృష్టికి తీసుకువెళ్లినా ఇంత వరకు సమస్య పరిష్కారం కాలేదు. దీంతో అనేక మంది ప్రమాదాలకు గురవుతున్నారు.

రైతులకు అపార నష్టం



ఎర్రకాలువ ప్రధాన కాలువలో గట్టు పటిష్టతకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. డ్యామ్ గేట్ల నుంచి నీరు విడుదల చేసే సమయాల్లో పొలాలను వరద నీరు ముంచెత్తుతోంది. వరద ముంపుతో రైతులు తీవ్ర నష్టాలను చవిచూడాల్సి వస్తోంది. ప్రస్తుత ప్రభుత్వం సమస్యలను పరిష్కరించాలి.

– బడే సత్యనారాయణ, పుట్లగట్లగూడెం

హామీ నెరవేర్చాలి



పట్టిన్నపాలెంలో జల్లేరు వాగుపై నిలిచిపోయిన వంతెన నిర్మాణ పనులు ప్రారంభించాలి. వరదల సమయంలో రైతులు, ప్రజలు రాకపోకలు నిలిచిపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారు. రైతుల పొలాలు వాగుకి అవతల వైపు ఉండటంతో వాగు వచ్చిన సమయంలో రాకపోకలు నిలిచిపోతున్నాయి. పాలకులు స్పందించి వంతెనను త్వరితగతిన పూర్తి చేయాలి

– రామిశెట్టి వెంకటేశ్వరరావు, పట్టిన్నపాలెం

రోడ్లు బాగు చేయండి

ఇటీవల భారీ వర్షాలకు రోడ్లు పెద్దపెద్ద గోతులు పడ్డాయి. ముఖ్యంగా చింతలపూడి, యర్రగుంటపల్లి గ్రామాల మధ్య అధ్వానంగా తయారయ్యాయి. రోడ్ల మరమ్మతులు చేయాలని ఎన్నిసార్లు అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదు. ఎమ్మెల్యే రోషన్ కుమార్ వెంటనే నిధులు మంజూరు చేసి రోడ్లను అభివృద్ధి చేయాలి.

– పిడపర్తి ముత్తారెడ్డి, పౌరహక్కుల సంఘం నాయకులు, యర్రగుంటపల్లి

చెరకు పంటకు మద్దతు ధర ప్రకటించాలి



తక్కెళ్లపాడులో చెరకు పంటను పరిశీలిస్తున్న రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యనారాయణ

ద్వారకాతిరుమల: చెరకు టన్నుకు 9.5 రికవరీ శాతంపై రూ.4వేలు మద్దతు ధర ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ చెరకు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మర్రాపు సూర్యనారాయణ డిమాండ్ చేశారు. మండలంలోని తక్కెళ్ళపాడు, గుణ్ణంపల్లి గ్రామాల్లో రైతు సంఘ నేతలతో కలిసి శుక్రవారం పర్యటించిన ఆయన చెరకు పంటలను పరిశీలించారు. తక్కెళ్ళపాడులో చెరకు రైతు ముల్లంగి ఈశ్వరరెడ్డి సాగు చేస్తున్న 2468 విత్తనం చెరకు దిగుబడి ఎకరాకు 70 టన్నులు రావడంతో సాగు వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో ఐదు లక్షల ఎకరాల్లో సాగయ్యే చెరకు పంటలో ఇప్పుడు 5 వేల ఎకరాల సాగు పడిపోయిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల ఫలితంగా చెరకు రైతులు సంక్షోభంలో కూరుకుపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో చెరకు ఫ్యాక్టరీలన్నీ మూతపడ్డాయని చెప్పారు. చెరకు పంటపై ఆధారపడిన రైతులు, కూలీలు, కార్మికులు ఉపాధి కోల్పోయారన్నారు. మళ్లీ చెరకు పంటకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సాహం అందించాలని డిమాండ్ చేశారు. మూతపడ్డ చెరకు ఫ్యాక్టరీలను తెరిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు, జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, జిల్లా సీనియర్ నాయకులు గుత్తికొండ వెంకట కృష్ణారావు పాల్గొన్నారు.

28 నుంచి శిక్షణ తరగతులు

జంగారెడ్డిగూడెం: ఈ నెల 21, 22, 23 తేదీల్లో జంగారెడ్డిగూడెం గురవాయిగూడెం పంచాయతీ మానవతా హాలులో సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించనున్న శిక్షణ తరగతులు కొన్ని అనివార్య కారణాల వల్ల వాయిదా వేశామని సీఐటీయూ కార్యదర్శి షేక్ సుభాషిని తెలిపారు. శుక్రవారం ప్రజా సంఘాల కార్యాలయంలో సీఐటీయూ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుభాషిణి మాట్లాడుతూ ఆ తరగతులు 28, 29,30 తేదీల్లో మానవతాహాలులో నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశాలకు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు, ఐఏసీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీ.ఉమామహేశ్వరరావు హాజరవుతారని తెలిపారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఎస్. రాంబాబు, టౌను అధ్యక్షులు పాల్గొన్నారు.

వీఆర్‌ఏలకు వేతనం పెంచాలి



వీఆర్‌ఏల సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్

కుక్కునూరు: వీఆర్‌ఏలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్ డిమాండ్ చేశారు.శుక్రవారం కుక్కునూరు సుందరయ్య భవనం ప్రజాసంఘాల కార్యాలయంలో సీఐటీయూ ఆధ్వర్యంలో గ్రామ రెవెన్యూ సహాయకుల సమావేశం పోచారపు వెంకన్నబాబు అధ్యక్షతన నిర్వహించారు.ఈ సమావేశంలో సాయికిరణ్ మాట్లాడుతూ గ్రామంలోని ప్రజలకు, అధికారులకు మధ్య వారధిగా విధులు నిర్వహిస్తున్న వీఆర్‌ఏలు చాలిచాలని గౌరవవేతనంతో తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా అటెండర్, నైట్‌వాచ్‌మెన్,గ్రేడ్ 2 వీఆర్‌ఓ పోస్టులు ఖాళీగా ఉన్నాయని వాటికి అర్హులైన వీఆర్‌ఏలతో ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. వీఆర్‌ఏలకు కనీసవేతనం రూ.26 వేలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీఐటీయూ మండల సహాయ కార్యదర్శి కాకర్ల శ్రీను, వీఆర్‌ఏలు భూక్య చందు, వర్కా శివ, శంకర్, చినరాజు, నాగమణి,శేఖర్, నరసింహరావు, పోశమ్మ పాల్గొన్నారు.

తోట సూర్యారావుకు ఘన నివాళి



సీతంపేటలో తోట సూర్యారావు చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే బాలరాజు

కొయ్యలగూడెం: బయ్యనగూడెం పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు తోట జయబాబును మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పరామర్శించారు. సీతంపేటలోని జయబాబు నివాసానికి వెళ్లి ఆయన తండ్రి సూర్యారావు మృతికి సంతాపం వ్యక్తం చేశారు. సూర్యారావు 16వ తేదీ గుండె పోటుతో అకస్మాత్తుగా మృతి చెందారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. సీతంపేట పంచాయతీ పరిధిలో రైతు ప్రతినిధిగా పార్టీలకు అతీతంగా సూర్యారావు సేవలందించారని తన కుమారుడైన జయ బాబును రైతు నాయకునిగా తీర్చిదిద్దారన్నారు. ఆయన మృతి వైఎస్సార్‌సీపీ రైతు విభాగానికి తీరని లోటన్నారు. ఈ సందర్భంగా కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి విష్ణు, పార్టీ నాయకులు గొడ్డటి నాగేశ్వరరావు, మందపాటి రామకృష్ణ పసుపులేటి రాంబాబు, కంభంపాటి బుజ్జిబాబు, తోటకూర శ్రీను, మధ్యాహ్నపు యేసు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న దీపాలంకరణ



కొయ్యలగూడెంలో దీపాలంకరణ

కొయ్యలగూడెం: వినాయక చవితి పర్వదినోత్సవాల్లో భాగంగా 14 రోజు శుక్రవారం గణేష్ ఉత్సవ మందిరాల వద్ద విశేష పూజలు ప్రసాద పంపిణీ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అతి పెద్దదైన పదిహేను అడుగుల భారీ గణనాథుని విగ్రహ ఊరేగింపు ఉత్సవం శనివారం కొయ్యలగూడెంలో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా స్వామివారి భారీ విగ్రహం ముందు మహిళలు దీపాలంకరణ చేశారు. ఓంకారం, స్వస్తిక్ ఆకారంలో దీపాలంకరణ అందరినీ ఆకట్టుకుంది.

జాబ్ మేళాకు 124 మంది హాజరు



టైలరింగ్ కోర్సు శిక్షణలో సర్టిఫికెట్లు పొందిన అభ్యర్థులు

కామవరపుకోట: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో ఏలూరు జిల్లా కామవరపుకోట మండలం తడికలపూడిలోని ఎన్టీఆర్ మహిళా ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన జాబ్ మేళాకు 124 యువత హాజరయ్యారు. 55 మంది వివిధ కంపెనీల్లో ఉపాధి పొందినట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గంటా సుధాకర్ తెలిపారు. అదే ప్రాంగణంలో ఇటీవల సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ టైలరింగ్ కోర్స్ పూర్తి చేసుకున్న 30 మంది అభ్యర్థులకు సర్టిఫికెట్లు అందజేసినట్లు ఆయన తెలిపారు. ఈ జాబ్ మేళాలో ఎస్.ఎస్.ఎస్.వి (అరబిందో ఫార్మా), లగ్జరీ లాండ్ లోడ్ యూనివర్సల్ ప్రాజెక్టు, బజాజ్ క్యాపిటల్, అమెజాన్ (కె.ఎల్ గ్రూప్), జీనియస్ కన్సల్టెంట్‌ల కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి మధు సుధన్‌రావు, మహిళా ప్రాగణం జిల్లా మేనేజర్ రెబెకా శామ్యూల్, సీడీపీవో పి.బ్యూలా, జిల్లా ప్లేస్మెంట్ అధికారి ప్రవీణ్, కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

గ్రామాల్లో స్వచ్ఛతా హీ సేవ

కొయ్యలగూడెం: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం గవరవరం పంచాయతీ పరిధిలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఆర్‌బీటీ శ్రీలక్ష్మీ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటుడం, చెత్త తొలగింపు తదితర కార్యక్రమాలను నిర్వహించారు.ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఎల్‌పీవో ఎండి. రజవుల్లా, ఈఓపీఆర్‌డీ జి. సతీష్‌తో కలిసి ఎంపీడీవో మొక్కలు నాటారు. అక్టోబర్ 2 తేదీ వరకు అన్ని పంచాయతీల పరిధిలో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తామని ఎంపీడీవో తెలిపారు.

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల పోస్టర్ల విడుదల



అమ్మవారి ఆలయంలో పోస్టర్లు విడుదల చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

జంగారెడ్డిగూడెం: పట్టణంలో కొలువైన నూకాలమ్మవారి సన్నిధిలో నిర్వహించనున్న శరన్నవరాత్రి వేడుకలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం ఆలయంలో భక్తుల సమక్షంలో ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను, పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమానికి విచ్చేసిన శ్రీ బాలాత్రిపుర సుందరిపీఠ ప్రతినిధి ఆధ్యాత్మికవేత్త ఈమని శశికుమార్ శర్మ మాట్లాడుతూ ఆలయంలో నిర్వహించే శరన్నవరాత్రి వేడుకలకు ఒక ప్రత్యేకత ఉందని, అశ్వయుజ శుద్ధ పాడ్యమి నుంచి పౌర్ణమి వరకు ఉత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. అక్టోబర్ 16న ఛండీహోమం నిర్వహిస్తామన్నారు.

జిల్లాస్థాయి పోటీలకు బయ్యన్నగూడెం విద్యార్థి

కొయ్యలగూడెం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలకు బయ్యన్నగూడెం జెడ్పీ హైస్కూల్ విద్యార్థి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు కె.రవికుమార్ శుక్రవారం పేర్కొన్నారు. కొయ్యలగూడెంలో నిర్వహించిన నియోజకవర్గస్థాయి పోటీల్లో ప్రతిభ కనపరచడంతో సృజనను 14 విభాగంలో షటిల్ పోటీలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సృజనను ఉపాధ్యాయులు శిక్షణను ఇచ్చిన పీఈటీ దుర్గారావును అభినందించారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

జంగారెడ్డిగూడెం రూరల్: జంగారెడ్డిగూడెం మండలం కేతవరం అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పౌష్టికాహార వారోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. సెక్టార్ సూపర్ వైజర్ కే లక్ష్మి మాట్లాడుతూ పౌష్టికాహారంతో రోగనిరోధక శక్తి పెరిగి సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని అన్నారు. ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ముంపు బాధితులకు న్యాయం చేయాలి

పోలవరం: ఇటీవల కురిసిన భారీ వర్షాలతో ముంపునకు గురైన పొలాల నష్టం అంచనా సర్వేలో బాధితులందరి పొలాల వివరాలను నమోదు చేయలేదని తహసీల్దార్ ఆర్ఎస్ఎల్ఆర్‌రాజుకి రైతులు ఫిర్యాదు చేశారు. పంట వాగుల నీటితో పాటు గోదావరి ఎడపోటు నీరు కూడా కలిసి నాట్లు వేసిన వరి పొలాలు మూడు పర్యాయాలు వరద నీటిలో మునిగిపోయాయని వారన్నారు. నారు కూడా కుళ్లిపోయిందని, రైతులు తహసీల్దార్‌కు విజ్ఞప్తి చేశారు. సర్వే సమయంలో కొంత మంది రైతుల పేర్లు మాత్రమే నమోదు చేశారని ఇంకా కొంత మంది బాధితులున్నారని, పొలాలు పూర్తిగా దెబ్బతిన్నాయని వారందరికీ న్యాయం చేయాలని కోరారు. దీనిపై తహసీల్దార్ మాట్లాడుతూ సోమవారం నాటికి వ్యవసాయ, రెవెన్యూ సిబ్బందిని పంపి పొలాలను పరిశీలించి మళ్లీ సర్వే చేయించి రైతుల పేర్లు నమోదు చేస్తానని తెలిపారు.

పోషకాహారంతో ఆరోగ్యం



కొయ్యలగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: పోషకాహార మాసోత్సవ కార్యక్రమం శుక్రవారం అంగన్‌వాడీ కేంద్రం–6 నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు బాలింత తల్లులకు పోషకాహారం ప్రయోజనాన్ని వివరించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నయోమిరాణి ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంత కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సత్యసాయి వీధిలో పోషకాహార మసోత్సవ ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు శ్రీదేవి, నూర్జహాన్ పాల్గొన్నారు

విద్యార్థినులకు కంటి పరీక్షలు



కన్నాపురం జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: కన్నాపురం జెడ్పీ హైస్కూల్లో శుక్రవారం విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. కొయ్యలగూడెం పీహెచ్‌సీ నేత్ర వైద్యులు సీహెచ్ చక్రవర్తి కంటి పరీక్షలు చేశారు. మొత్తం 385 మందికి కంటి పరీక్షలు చేసి అందులో 24 మందికి దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించారు. ప్రభుత్వం ద్వారా వీరికి కళ్లజోళ్లు సమకూర్చాల్సిందిగా సిఫార్సు చేశామన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు క్రిస్టాఫర్, హెల్త్ సూపర్వైజర్ మంగా రావు, మరియు ఆశలు పాల్గొన్నారు.